



ఉప్పరపల్లిలో పండమేరు వరద నీటిలో గుడిసెలు (ఫైల్)

జెండా పీకలేరా..?

యథేచ్ఛగా వంకలు, చెరువు భూములు ఆక్రమణ

తొలగింపులో రెవెన్యూ అధికారుల మీనమేషాలు

మీడియాలో వచ్చినపుడు మాత్రమే కొంత హడావుడి

నోటుతో నోరు మూయిస్తున్న ఆక్రమణదారులు..!

అనంతపురంరూరల్, మే25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో వంకలు, చెరువుల ఆక్రమణకు అడ్డు, అదుపులేకుండా పోయింది. భూములు ఖాళీగా కనిపిస్తే చాలు ఆక్రమణదారులు జెండా పాతేస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఇలాంటివి ఎక్కువగా జరిగాయి. భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఆక్రమణలకు సంబంధించిన కథనాలు పత్రికల్లో వచ్చినప్పుడే మాత్రమే అక్కడికి వెళ్లడం, వాటిని వెంటనే తొలగించాలని చెప్పడం, లేదంటే గడువు విధించి తొలగించుకోవాలని చెప్పడం పరిపాటైపోయింది. ఆ తరువాత ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి కార్యక్రమాలు చేయడం లేదు. దీని వెనుక కొందరు అధికారుల మామూళ్ల లాలూచీ వ్యవహారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కురుగుంట వైఎస్సార్ కాలనీలో వైసీపీ నాయకుడు ఓపెన్ సైట్ ఆక్రమించి వేసిన షెడ్లు



పాములరాయి గ్రామ సమీపంలో ఉన్న గుడిసెలు

ఆక్రమణ నిజమని తెలిసినా..

అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లి, కురుగుంట, కక్కలపల్లి, చిన్నంపల్లి గ్రామాల్లో వంకల ఆక్రమణలు పెద్దఎత్తున జరిగాయి. ఉప్పరపల్లిలోని పండమేరు వంక పొడవునా ఆక్రమణలు జరిగాయి. దళిత నాయకుల మాటున భూములు ఆక్రమించి గుడిసెలు వేశారు. గత ఏడాది పండమేరు వరదకు, పదిరోజుల కిందట కురిసిన ఓ మోస్తరు వర్షాలకు బీజేపీ, ప్రజాశక్తి కాలనీలు నీట మునిగాయి. ఆక్రమణల నేపథ్యంలో స్థానికంగా ఉన్న మరువ వంక, ఎర్రవంక పూర్తిగా కుంచించుకుపోయాయి. ప్రజాశక్తి కాలనీ పైభాగంలో ఓ విల్లాదారుడి నిర్వాకంతో 80మీటర్లు ఉండాల్సిన మరువవంక నాలుగు మీటర్లకు తగ్గిపోయినట్లు ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. మరో ఇద్దరు వెంచర్ నిర్వాహకులతో ఎర్ర వంక కొన్ని చోట్ల ఐదు అడుగులకు కుంచించుకుపోయింది. చిన్నంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 98లోని వంక భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించి అమ్మకాలకు బేరం పెట్టారు. నలుగురైదురికి అగ్రిమెంట్లు చేసినట్లు సమాచారం. ఈక్రమంలో ఆ అగ్రిమెంటుదారులు ఒకరిని మించి ఒకరు విడతల వారిగా భూమిని చదును చేస్తున్నారు. ఇవన్నీ రెవెన్యూ అధికారులకు తెలియనివి కావు. ఉప్పరపల్లిలో గుడిసెలు తొలగింపు ప్రక్రియ ఏడాది కాలంగా జరుగుతోంది. ఇంత వరకు రెవెన్యూ అధికారులు మాత్రం అడుగు ముందుకు వేయని పరిస్థితి.



కురుగుంట వైఎస్సార్ కాలనీలో ఓపెన్ సైట్ ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ (ఫైల్)

చెరువు, ఓపెన్ స్థలం ఆక్రమణలోనూ ఇదే పరిస్థితి

వంకల ఆక్రమణలోనే కాదు..చెరువు, ఓపెన్ స్థలాల ఆక్రమణలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సోములదొడ్డి గ్రామ సర్వే నెంబరు 160లోని రెండు ఎకరాల చెరువు భూమిని కుల సంఘం పేరిట ఆక్రమించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈనేపథ్యంలో ఈఏడాది జనవరి 30న ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్ ఇతర రెవెన్యూ యంత్రాంగం అక్కడి వెళ్లారు. చెరువు భూమి అని, నీళ్ల వచ్చినప్పుడు ఇది మునుగుతుందని, గుడిసెలు తొలగించాలని చెప్పారు. ఇది జరిగి కూడా నాలుగు నెలలు గడచింది. ఇంత వరకు ఆ గుడిసెలు తొలగింపులో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే ఓ రెవెన్యూ అధికారి సంబంధిత కుల సంఘం నాయకుడి నుంచి పెద్ద మొత్తంలో నగదు పుచ్చుకోవడం వల్లే చర్యలు లేవనే చర్చ జరుగుతోంది. కురుగుంట గ్రామ సర్వే నెంబరు 91-లో ఉన్న 30సెంట్ల ప్రభుత్వ భూమిని స్థానిక వైసీపీ నాయకుడు ఆక్రమించాడు. దీనిపై మార్చి 10న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆక్రమణలను తహసీల్దార్ మోహన్‌కుమార్ పరిశీలించారు. ఆయన ఆక్రమణదారులను పిలిపించి మాట్లాడారు. షెడ్లను తొలగించాలని సూచించారు. తొలగింపులకు కొంత సమయం ఇవ్వాలని ఆక్రమణదారులు కోరారు. గడువులోగా షెడ్లను తొలగించాలని లేనిపక్షంలో తామే తొలగిస్తామని హెచ్చరించారు. తర్వాత ఎలాంటి చర్యలూ లేవు. ఇలా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతోనే ఆక్రమణదారులు వంకలు, చెరువులు, ఓపెన్ సైట్లను యథేచ్ఛగా ఆక్రమించి, అమ్ముకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పాములరాయి గ్రామ సమీపంలో గుడిసెలు వేసుకున్న వారితో మాట్లాడుతున్న ఆర్డీఓ, తహసీల్దార్ (ఫైల్)

కోర్టులకు వెళ్లడంతోనే ఆలస్యం



ఆక్రమించుకున్నవారందరికి నోటీసులు ఇచ్చాం. అయితే ఆ నోటీసులపై వారు కోర్టులను ఆశ్రయించారు. దీంతో మేము కూడా కౌంటర్లు దాఖలు చేశాం. కోర్టుకు సెలవులు ముగిసిన తరువాత చర్యలు తీసుకుంటాం. కక్కలపల్లి పరిధిలోని వంకల ఆక్రమణలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. రెవెన్యూ, పంచాయతీ, మైనర్ ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. ఆమేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-మోహన్‌కుమార్, తహసీల్దార్

ఒకే రోజే ముగ్గురు శిశువుల మృతి..?

సర్వజనాస్పత్రిలో కలకలం

- బయటకు పొక్కకుండా జాగ్రత్తలు
- ఓ తండ్రి ఆవేదనతో వెలుగులోకి వాస్తవం

అనంతపురం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో శనివారం ఉదయం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ముగ్గురు శిశువులు మృతి చెందినట్లు చెబుతున్నారు. అధికారులను అడిగినా, డాక్టర్లను అడిగినా అబ్బే అలాంటిదేమీ లేదు అనే సమాధానాలు వస్తున్నాయి. ఓ శిశువు తండ్రి ఈ మరణాలపై బయటకు చెప్పడంతో డాక్టర్లు, సిబ్బంది బాధ్యతారాహిత్యం వెలుగు చూసింది.



జిల్లా ఆస్పత్రిలోని కాన్పుల వార్డు

మరణాల కలకలం

జిల్లాసర్వజన ఆస్పత్రిలో ఒక్కరోజే ముగ్గురు శిశువులు మరణించారన్న సమాచారం తీవ్ర కలకలం రేపుతోంది. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ గర్భిణి శనివారం ఉదయం ప్రసవించగా శిశువు చనిపోయిందట. అలాగే రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఓ మహిళ సాయంత్రం డెలివరీ కాగా.. ఆ శిశువు మరణించిందట. అదేరోజు అర్ధరాత్రి సమయంలో వజ్రకరూరుకు చెందిన లక్ష్మీకాంతమ్మ ప్రసవించగా పుట్టిన శిశువు చనిపోయింది. దీంతో ఆ శిశువు తండ్రి ప్రదీప్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ఆర్ఎంఓ రామ్మృష్ణ దగ్గరకు వెళ్లి నా బిడ్డ ఎందుకు చనిపోయిందో తెలపాలనీ, డాక్టర్ల తీరుపై ఫిర్యాదు చేశాడు. తమ బిడ్డే కాదు ఇంకా ఇద్దరు కూడా చనిపోయారని, ఇందుకు డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ప్రదీప్ ఆరోపించాడు. ముగ్గురు శిశువుల మరణంపై విలేకరుల ఆరాతీయడానికి వెళ్లగా, అప్పటికే ఆ బాలింతలు డిశ్చార్జ్ అయి వెళ్లారని తెలిసింది. అయితే విషయం బయటకు పొక్కకుండా వైద్యులు పలు జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం

డాక్టర్ల నిర్లక్ష్యమా..?

ఆస్పత్రికి డెలివరీ కేసులు అధికంగా వస్తాయి. అధికారుల లెక్కల మేరకే జిల్లా ఆస్పత్రిలో ప్రతిరోజు 20నుంచి 30మంది వరకు డెలివరీ కోసం వస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో ఒక్కోసారి డెలివరీకి వచ్చిన గర్భిణులకు పడకలు కూడా దొరకవు. అయితే ఈ విభాగంలో పని చేసే కొందరు డాక్టర్లు, సిబ్బంది గర్భిణులు, బాలింతల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనికి డ్యూటీ ఒత్తిడి వల్లే డాక్టర్లు ఆయా సమయాలలో సరిగా విధులు నిర్వహించలేకపోతున్నారంటున్నారు. నిబంధనల మేరకు ఏ వార్డులో ఏం జరిగినా వాటి సమాచారాన్ని సూపరింటెండెంట్, ఆర్ఎంఓలకు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఒకేరోజు ముగ్గురు శిశువులు చనిపోయారని ప్రచారం జరుగుతున్నా ఆ సమాచారం లేదనడం చూస్తే ఆస్పత్రిలో ఏమేరకు సమన్వయం ఉందో అర్థమవుతోంది.

నా బిడ్డ ఎందుకు చనిపోయిందో చెప్పరు



నాభార్య లక్ష్మీకాంతమ్మను ఈనెల 22నే ముందుజాగ్రత్తగా జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చి అడ్మిట్ చేశా. 24వ తేదీ రాత్రికి నొప్పులు వచ్చాయి. కొంచెంసేపు నొప్పులు రావడం, ఆగిపోవడం జరుగుతూ వచ్చింది. దీనివల్ల సాధారణ డెలివరీ కష్టమని సిజేరియన్ చేస్తామని అర్ధరాత్రి సమయంలో డాక్టరు చెబుతూ ఉండగానే నొప్పులు వచ్చాయి. డెలివరీకి లోపలికి తీసుకెళ్లారు. ఆతర్వాత వెంటనే పుట్టిన బిడ్డను తీసుకొని నర్సులు పరిగెత్తుకుంటూ ఎస్ఎన్‌సీయులోకి వెళ్లారు. అక్కడ ఐసీయూలో ఉంచిన కొద్ది నిమిషాలలోనే బిడ్డ చనిపోయిందని చెప్పి అట్టపెట్టెలో ఉంచి ఇచ్చారు. కానా నాబిడ్డ ఎందుకు చనిపోయిందంటే సరైన సమాచారం చెప్పడంలేదు. పీజీ డాక్టర్లు డెలివరీ చేయడం వల్లే నాబిడ్డ చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఇద్దరు శివువులు కూడా చనిపోయారని ఆవేదన చెందారు.

-ప్రదీప్, శిశువు తండ్రి, వజ్రకరూరు

ఒకరు చనిపోయినట్లు ఫిర్యాదు

రాత్రి సమయంలో డెలివరి అయిన ఓశిశువు చనిపోయినట్లు నాకు ఫిర్యాదు వచ్చింది. వెంటనే డాక్టర్‌తో మాట్లాడా. శిశువు మెడకు పేగు చుట్టుకోవడం వల్లనే చనిపోయినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని ఫిర్యాదుచేయడానికి వచ్చిన బాలింత భర్తకు తెలిపా. మిగిలిన ఇద్దరు శిశువులు మరణించినట్లు నాదృష్టికి రాలేదు.

- డాక్టరు రామకృష్ణ, ఆర్ఎంఓ

సమాచారం లేదు

ఆస్పత్రిలో ముగ్గురు శిశువులు చనిపోయారనే విషయం నాకు తెలియదు. నేనే ఇన్‌చార్జ్‌గా ఉన్నా. ఈరోజు సాయంత్రం డేటా తెప్పించుకున్నా. అందులోకూడా శిశువుల మరణాల సమాచారం ఆ విభాగం నుంచి రాలేదు. దీనిపై ఆరాతీస్తా.

-డాక్టరు ఆత్మారామ్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

దరఖాస్తులు గల్లంతు...!

గ్రేడ్-2 హెచ్‌ఎంల అప్లికేషన్లు మాయం

గోప్యంగా ఉంచుతున్న అధికారులు

ముచ్చుకోట హెచ్‌ఎం లేక టీచర్ల అవస్థలు

ఉపాధ్యాయ బదిలీల వేళ గందరగోళం

అనంతపురం విద్య, మే 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం నెలకొంది. కొన్ని సాంకేతిక సమస్యలైతే, మరికొన్ని అధికారులు చేసే తప్పిదాలతో ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. కొందరు హెచ్‌ఎంలు చేసిన దరఖాస్తులు సైతం కనిపించడం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే డివైఈఓలు, డీఈఓ లాగిన్స్ కనిపించాలి. లేదా విద్యాశాఖ కమిషనర్ లాగిన్‌లోనైనా కనిపించాలి. కానీ కొందరి దరఖాస్తులు ఎక్కడా కనిపించడంలేదని తెలిసింది. దీనిపై విద్యాశాఖాధికారికి ఫిర్యాదు కూడా చేశారు. పెద్దపప్పూరు మండలంలో టీచర్ల బదిలీ దరఖాస్తులపై స్క్రూటినీ సంతకం చేసే హెచ్‌ఎం రెండు రోజులుగా అందుబాటులో లేడని సమాచారం. ఆఖరి రోజు కావడంతో ఆ స్కూల్‌లోని టీచర్లు హైటెన్షన్‌తో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ విద్యాశాఖాధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

వేధిస్తున్న నిర్లక్ష్యం

బదిలీల్లో టెక్నికల్ సమస్యలతోపాటు, అధికారులు నిర్లక్ష్యం కూడా టీచర్లను వేధిస్తోంది. గ్రేడ్ -2 హెచ్‌ఎంల్లో కొందరు ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులు కనిపించడం లేదు. ఈ నెల 21న తాడిపత్రి మండలం చుక్కలూరు జడ్పీహైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న సుధాకర్ బదిలీ కోసం దరఖాస్తు చేశారు. ఈ నెల 21నే ఆయన అప్లికేషన్ జనరేట్ అయ్యింది. 22న గుత్తి డీవైఈఓ లాగిన్‌కు అప్లికేషన్ సబ్‌మిట్ చేశారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఆఖరికి ప్రధానోపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియారిటీ లిస్టులో ఆయన పేరు లేదు. సాంకేతిక సమస్యో లేక విద్యాశాఖ సిబ్బంది నిర్లక్ష్యమో తెలియదు కానీ బదిలీ దరఖాస్తు గల్లంతైంది. దీనిపై ఆయన డీఈఓ ప్రసాద్‌బాబుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం బదిలీల దరఖాస్తు చేసిన తర్వాత డిప్యూటీ డీఈఓ లాగిన్‌కు, ఆ తర్వాత డీఈఓ లాగిన్‌కు, ఫైనల్‌గా కమిషనర్ (సీఎస్ఈ) లాగిన్‌కు వెళ్తాయి. అయితే ఆ హెచ్‌ఎం దరఖాస్తు ఎవరి లాగిన్‌కు చేరలేదని సమాచారం. ఇలా మరి కొందరి దరఖాస్తులు కూడా గల్లంతయినట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.



బదిలీల్లో గ్రీవెన్సులు స్వీకరిస్తున్న డీఈఓలు ఇతర సిబ్బంది

టీచర్లకు హై టెన్షన్...!

బదిలీల వేళ...స్క్రూటినీ సంతకం చేయాల్సిన హెచ్‌ఎం అందుబాటులో లేక కొందరు టీచర్లు టెన్షన్ పడ్డారు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట స్కూల్ హెచ్‌ఎం అందుబాటులో లేకపోవడంతో బదిలీలకు అప్లై చేసిన టీచర్లు అవస్థలు పడ్డారు. బదిలీల కోసం చేసిన దరఖాస్తులను హెచ్‌ఎం స్క్రూటినీ చేసి సంతకం చేయాలి. ఆ తర్వాత ఆ దరఖాస్తులు ఎంఈఓలకు చేరుతాయి. అయితే స్క్రూటినీ చేయాల్సిన హెచ్‌ఎం అందుబాటులో లేకవడంతో బదిలీకి దరఖాస్తు చేసిన టీచర్లు హైటెన్షన్ పడ్డారు. ఈ సమస్య డీఈఓ దృష్టికి కూడా వెళ్లినట్లు తెలిసింది. రెండు రోజులుగా టీచర్లు ఇబ్బంది పడినా...అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి.

ఎంఈఓకు ఆదేశాలిచ్చాం: ప్రసాద్‌బాబు, డీఈఓ

బదిలీల దరఖాస్తుల్లో ఒక ప్రధానోపాధ్యాయుడి అప్లికేషన్ గల్లంతయ్యింది. రాష్ట్ర ఐటీ సెల్ అధికారులకు సమాచారం ఇచ్చాం. ముచ్చుకోట ప్రధానోపాధ్యాయుడు అందుబాటులో లేరు. ఫోన్ చేస్తే నాట్ రీచ్‌బుల్ వస్తోంది. ఆ స్కూల్ టీచర్లు ఇబ్బంది పడకుండా వాళ్ల దరఖాస్తులు స్క్రూటినీ చేసి కన్ఫర్మేషన్ చేయాలని ఎంఈఓకు ఆదేశాలిచ్చాం.

విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఖరారు



7

దళితుల శ్మశాన వాటిక స్థలాలకు రక్షణ ఏదీ?

- ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి
- రోడ్డుపై మృతదేహంతో దళిత నేతల నిరసన

రాప్తాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): దళితుల శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాలకు సైతం రక్షణ లేకుండా పోయిందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని భోగినేపల్లిలో మాల రామచంద్రయ్య (61) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. దీంతో ప్రభుత్వం దళితుల శ్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఆదివారం తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన కొంత మంది వారిని అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి భోగినేపల్లి గ్రామానికి చేరుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాప్తాడు సీఐ శ్రీహర్ష, రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ విజయ్‌కుమార్, ఆర్ఐ కరుణాకర్‌లు గ్రామానికి వచ్చి అంత్యక్రియలకు అడ్డు వస్తున్న వారితో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. ఆ భూమిపై కోర్టు స్టే ఉందని, అక్కడ అంత్యక్రియలు చేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని మహిళలు తెలిపారు. దళితులకు రెవెన్యూ అధికారులు అధికారికంగా కేటాయించిన స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహించాలని అధికారులు, పోలీసులతో సాకే హరి వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మృతదేహాన్ని నడిరోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. తహసీల్దార్ విజయ కుమారి గ్రామానికి చేరుకుని దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాని, కొందరు వ్యక్తులు ఆ స్థలం తమదేనని హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారన్నారు. దళితులకు కేటాయించిన స్థలంలోనే త్వరలోనే అంత్యక్రియలు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శవాన్ని వెనక్కి తీసుకుని వెళ్లి వేరే ప్రదేశంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఎల్లన్న, నరేష్, శ్రీనివాసులు, రమేష్, రామకృష్ణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



భోగినేపల్లిలో శవాన్ని నడిరోడ్డుపై పెట్టుకుని నిరసన తెలుపుతున్న దళితులు

జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సెంట్రల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం జిల్లా పరిషత్‌లో ఎన్నిక నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు నాయక్ ఎన్నికయ్యారు. అసోసియేట్ ఉపాధ్యక్షులుగా చింతల పాల్, నాగేశ్వరయ్య, అశోక్‌బాబు, వెంకట్రాముడు, కలీం అహ్మద్, శివారెడ్డి, శశిధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు.



నూతన కార్యవర్గం

ఘనంగా కల్లూరు సుబ్బారావు జయంతి

బాలగొండ ఆంజనేయులుకు కల్లూరు సుబ్బారావు అవార్డు

అనంతపురం కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు 128 జయంతి వేడుకలను ఆదివారం సాయంత్రం స్థానిక లలితకళాపరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. పరిషత్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డీఆర్వో మలోల ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కళారంగ అభివృద్ధికి కల్లూరు సుబ్బారావు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. కళారంగం పట్ల సుబ్బారావుకు వున్న మమకారం, పరిషత్‌తో ఆయనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. తదనంతరం సతీ తిమ్మమాంబ చిత్ర దర్శకుడు బాలగొండ ఆంజనేయులుకు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు అవార్డు అందజేసి, సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డ్యాన్స్ మాస్టర్లు విష్ణు, అర్జున్ భరద్వాజ్ శిష్య బృందాలు నృత్యాలతో అలరించాయి. కార్యక్రమంలో పరిషత్ కార్యవర్గం రామగోవింద్‌సాగర్, రాజకుల్లాయప్ప, శంకర్, సోమిరెడ్డి, ఎర్రిస్వామి, రఘు, అస్లాంబాషా పాల్గొన్నారు.



కల్లూరు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో, మలోల, ఎల్‌కేపీ సిబ్బంది

విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఖరారు

అనంతపురం అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగ సబ్సిడీ ధరను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది కే-6, టీసీజీఎస్ 1694, కదిరి లేపాక్షి రకం వేరుశనగకు 40 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. కే-6 రకం వేరుశనగ క్వింటాల్ పూర్తి ధర రూ.9300లుగా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3720పోను రైతు వాటా కింద రూ.5580 చెల్లించాలి. టీసీజీఎస్ 1694 రకం వేరుశనగ క్వింటాల్ పూర్తి ధర రూ.9300లుగా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3720పోను రైతు వాటా రూ.5580లు చెల్లించాలి. కదిరి లేపాక్షి రకం వేరుశనగ క్వింటాల్ పూర్తి ధర రూ.8200లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ మొత్తం రూ.3280లుపోను రైతు వాటా రూ.4920లు చెల్లించాలి. అర ఎకరా వరకు (30 కేజీ వేరుశనగ బ్యాగ్) ఒక బ్యాగ్, అరఎకరా నుంచి ఎకరా వరకు 2 బ్యాగ్‌లు, ఒక ఎకరా నుంచి ఆపైన ఎకరాలున్న రైతులకు 3 బస్తాలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

పెనుకొండ రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): వాటర్ హీటర్‌ను తాకి చిన్నారి మృతి చెందిన సంఘటన పెనుకొండ సమీపంలోని రబ్బర్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ఆతూరు తాలూకా మళ్లియాకర్రై గ్రామానికి చెందిన అశోక్ తన భార్య పిల్లలతో పెనుకొండ సమీపంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టలో పనిచేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం స్నానానికి వేడినీటి కోసం హీటర్‌ను ఉంచారు. అయితే అశోక్ పెద్దకుమార్తె సెల్వ మౌళిక(7) ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు దాన్ని తాకింది. షాక్‌కు గురైన చిన్నారిని గమనించిన తల్లి గాయిత్రి, భర్త ఇతర శ్రామికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. గాయిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

11కేవీ వైర్లు తగిలి బాలుడు...

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ కళాకారుల కాలనీలో సాకే మల్లికార్జున కుమారుడు సాకే జయకృష్ణ (13) ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళాకారుల కాలనీలో నివాసం ఉంటున్న పెయింటర్ సాకే మల్లికార్జున కుమారుడు సాకే జయకృష్ణ ఆదివారం సాయంత్రం గాలిపటం కోసం ఇంటిపైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్‌లైన్లు బాలుడికి తగిలి మంటలు వ్యాపించాయి. దీంతో బాలుడు సాకే జయకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు కట్టెల ద్వారా జయక్రిష్ణను విద్యుత్ తీగల నుంచి తప్పించారు. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

క్రికెట్ జట్టు ఎంపికకు తీవ్రపోటీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 25 (ఆంధ్రజ్యోతి): అండర్-19 జిల్లా సీనియర్ జట్టు ఎంపికకు తీవ్ర పోటీ నెలకొంది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ స్టేడియంలో జిల్లా అండర్-19 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందుకు 155మంది క్రీడాకారులు హాజరయ్యారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు షాషావలీ, డేవిడ్‌రాజ్, సుధీర్‌రెడ్డి, సర్దార్, రాఘవేంద్రలు క్రీడాకారుల ఫిట్‌నెస్, బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్‌లను పరిశీలించారు. తుది జట్టును త్వరలో ప్రకటించనున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, జిల్లా క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ సీనియర్ ప్లేయర్లు పాల్గొన్నారు.

బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రొళ్ల, మే 25(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని కె. బ్యాడిగెర గ్రామ చెరువు కట్ట శివారులో చింతచెట్టు కింద బెట్టింగ్ ఆడుతున్నారన్న సమాచారం వచ్చింది. సీఐ, ఎస్ఐ వీరాంజనేయులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.02లక్షలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా పరిశీలకుడు, కలెక్టర్



జేఎన్‌టీయూలో పరీక్షలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే25, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఏడు పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 2546మంది అభ్యర్థులు ఈపరీక్షలకు హాజరుకావాల్సిఉంది. ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు1522మంది హాజరయ్యారు. 1024మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1515మంది హాజరు కాగా మిగిలినవారు గైర్హాజరైనట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా పరిశీలకుడిగా వచ్చిన ఐఏఎస్ అధికారి ఎంఎంనాయక్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మతో కలిసి కేఎస్ఎన్‌మహిళా డిగ్రీకళాశాల, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీకళాశాల, ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంతమంది పరీక్షలు రాయాల్సి ఉంది? ఎంత మంది పరీక్షకు హాజరయ్యారు? వంటి వాటి గురించి సిబ్బందితో ఆరా తీశారు. పరీక్ష గదులలోకి వెళ్లి పరీక్షల నిర్వహణ, వసతులు పరిశీలించారు. జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ జేఎన్‌టీయూ కాలేజ్‌లో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. అక్కడ భద్రతా చర్యలను ఆయన ఆరాతీశారు.

మహాసేవకులు.. గ్రామీణ తపాలా ఉద్యోగులు

మీ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తా

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం సెంట్రల్, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి పోస్టల్ సర్వీసెస్‌ను తీసుకెళ్లే మహాసేవకులు గ్రామీణ తపాల ఉద్యోగులని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం(ఏఐజీడీఎస్‌యూ) మహాసభను ఆదివారం నిర్వహించారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన అనంతపురం డివిజన్-గుంతకల్లు బ్రాంచ్ 8వ ద్వైవార్షిక మహాసభకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులుగా మీకు న్యాయంగా దక్కాల్సిన వాటిపైన ప్రజా ప్రతినిధిగా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని హామీనిచ్చారు. మీ పోరాటంలో నిజాయతీ ఉందని, పట్టణ, గ్రామీణ ఉద్యోగులు పోటీతత్వంతో పనిచేస్తూ తపాలా శాఖ అభివృద్ధికి కృషి చేస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర ప్రతినిధిగా గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలి

: వెంకటేశ్వర్లు, జాతీయ అధ్యక్షుడు

తపాలా శాఖకు 85శాతం ఆదాయాన్ని గ్రామీణ తపాలా ఉద్యోగులు సమకూరుస్తున్నారని జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సరైన పెన్షన్ తీసుకోలేక దయనీయమైన స్థితిలో గ్రామీణ తపాలా ఉద్యోగులున్నారని వాపోయారు. 40ఏళ్ల నుంచి పనిచేస్తున్నా రూ.10వేల నుంచి రూ.14,500 మాత్రమే జీతం తీసుకుంటున్నారని, సీనియార్టీ ప్రకారం ఇంక్రిమెంట్లు కూడాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ తపాల ఉద్యోగులపట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఉద్యోగుల శ్రమను దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ తపాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలన్నారు. రూ.5లక్షల ప్రమాద బీమాను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

నాలుగు దశాబ్దాలుగా ఉద్యమం

: కృష్ణయ్య యాదవ్, డివిజన్ కార్యదర్శి

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నాలుగు దశాబ్దాలుగా ఉద్యమం చేస్తున్నామని డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. ఉద్యోగులను వేధిస్తున్న తపాలా శాఖ శాఖ సూపరింటెండెంట్ తీరును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి బదిలీ చేయించారన్నారు. ఇందుకు ఉద్యోగులందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తపాలా శాఖ టార్గెట్లను చేరేందుకు అరకొర జీతాలను సైతం పెట్టుబడిగా పెట్టాల్సి వస్తోందని వాపోయారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడంతో వివక్షను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీని కోరారు. అనంతరం ఏఐజీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించి, ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కేశవరావు, రమణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మర్రెరెడ్డి, జమాల్‌బాషా, శశికుమార్, శ్రీరాములు నాయక్, రామాంజనేయులునాయక్, సూర్యనారాయణరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మధు, శ్రీనివాసులు, రాజ్యలక్ష్మి, అనురాధ, మమత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో ఉంటే రోడ్డుపై పడేయండి

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపు

ఉనికిని కోసమే వైసీపీ నేతల వెంపర్లాట అంటూ ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో ఉంటే రోడ్లపై పడేయాలని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు.. టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వాధినేతగా... రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆ పదవిలో ఎవరున్నా గౌరవించాలన్నారు. ఎవరు అగౌరపర్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు సమాధి కట్టినా.. ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని మండిపడ్డారు. ఉనికి కోసమే ఎవరికి వారు వెంపర్లాడుతున్నారని రెండు రోజుల క్రితం ఎస్పీని కలిసిన వైసీపీ నేతలకు చురక అంటించారు. జడ్పీ సమావేశం నిర్వహించిన రోజున చైర్‌పర్సన్ కార్యాలయం వద్దకు సహచర ఎమ్మెల్యేలు దగ్గుపాటి, అమిలినేనితో కలిసి తాను వెళ్లానన్నారు. అంతకు ముందు జరిగిన సమావేశం రోజున ఎమ్మెల్యే దగ్గుపాటి, మంత్రి సవితతో కలిసి తాము సీఎం చంద్రబాబునాయుడు ఫొటోను చాంబర్‌లో పెట్టాలని చైర్‌పర్సన్‌కు చెప్పామన్నారు. ఫొటోను చైర్‌పర్సన్ గిరిజమ్మకు ఇచ్చామని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఫొటోను స్టోర్ రూం పక్కన పెట్టి, జగన్‌రెడ్డి ఫొటోను చాంబర్‌లో ప్రాధాన్యత కలిగిన ప్రదేశంలో పెట్టారన్నారు. ఈ నేపథ్యంలోనే తాము ముగ్గురం కలిసి చైర్‌పర్సన్ చాంబర్‌కు జడ్పీ సీఈఓను పిలిపించి, ఇది పద్ధతికాదని మందలించామన్నారు. జగన్‌రెడ్డి ఫొటోను అక్కడి నుంచి తొలగించి, సీఎం చంద్రబాబు, జాతిపిత మహాత్మాగాంధీ ఫొటోలను పెట్టించామన్నారు. అంతేగానీ జడ్పీ చైర్‌పర్సన్‌ను ఎక్కడా నిందించలేదు, దూషించలేదన్నారు. ప్రభుత్వం మారి ఏడాదవుతున్నా.. సీఎం ఫొటో బదులుగా జగన్‌ది పెట్టడంపై తాము సీఈఓను నిలదిస్తే.. వైసీపీ నాయకులు, కార్యకర్తలకు తప్పుగా అనిపిస్తుందా..? అని ప్రశ్నించారు. జడ్పీ చైర్‌పర్సన్ కూర్చునేది ప్రభుత్వ కార్యాలయంలో... అక్కడ సీఎం ఫొటో ఎందుకులేదని నిలదీసినందుకు తమను రౌడీలు, గూండాలంటూ తప్పుడు కేసులు పెడతారా..? అని మండిపడ్డారు. తమపై పోలీసులకు ఎవరైతే ఫిర్యాదు చేశారో ఆ మాజీ ఎంపీ రంగయ్య, ఇతర నాయకులు ఉనికి కోల్పోవడంతోనే... జగన్‌రెడ్డి దగ్గర మార్కులు కొట్టేసేందుకు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నది ప్రజలకే కాదు... వైసీపీ శ్రేణులకూ అర్థమవుతోందన్నారు. రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో ఏం చేయాలో దిక్కుతోచక, నాలుగు రోజుల క్రితం జరిగిన ఘటనను పెంచి, పెద్దది చేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలని వైసీపీ నేతలు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. రంగయ్య, మాధవ్ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా జగన్ ఫొటో ఉంటే అందుకు సంబంధిత అధికారే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. అధికారులు జాగ్రత్తపడాలని సూచించారు. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి అలవెన్స్‌లు, భత్యాలు తీసుకుంటున్న వ్యక్తికి సీఎం ఫొటో పెట్టుకోవాలన్న జ్ఞానం ఉండదా..? అని నిలదీశారు. సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని మొదటి క్యాబినేట్ భేటీలోనే తీర్మానం చేయడంతోపాటు అన్ని శాఖలకు ఆ నోట్ పంపించి, అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా... జడ్పీ సీఈఓ అమలు చేయకపోవడం బాధ్యతారాహిత్యం కాదా..? అని నిలదీశారు. మాజీ ఎంపీ రంగయ్య ఒక్కసారే చట్టసభలకు వెళ్లాడన్నారు. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యమేమీ లేదన్నారు. తనతోపాటు ఎమ్మెల్యేలు దగ్గుపాటి, అమిలినేని సురేంద్రబాబు రాజకీయాల్లో కిందిస్థాయి నుంచి కష్టపడి పైకొచ్చామన్నారు. టీడీపీ అధిష్ఠానం నుంచి సీట్లు తెచ్చుకొని, ప్రజాక్షేత్రంలో గెలిచామన్నారు. వైసీపీ నేతల తరహాలో జాక్‌పాట్‌లో తాము సీట్లు తెచ్చుకోలేదని రంగయ్య, మాధవ్‌కు ఘాటుగా బదులిచ్చారు. ఫొటో వివాదం అసలు విషయమే కాదన్నారు. రంగయ్య గతంలో ఉద్యోగిగా పనిచేసిన సమయంలో ఆయన అక్రమాలపై ఎవరైనా గొడవ చేస్తే కుల సంఘాన్ని మభ్యపెట్టి, తనకు అనుకూలంగా ధర్నాలు, నిరసనలు చేయించుకున్న నీచ చరిత్ర ఆయనది కాదా అని ప్రశ్నించారు. గతంలో సీఐగా పనిచేసి, ఎంపీ అయిన గోరంట్ల మాధవ్‌కు కనీసం చట్టం, ప్రజాస్వామ్యంపై అవగాహన లేదని మండిపడ్డారు. అతనికి సీఐగా పనిచేయడం కంటే అవినీతిపరుల అడుగులకు మడుగులొత్తేది మాత్రమే తెలుసని ధ్వజమెత్తారు. ఇలాంటి నాయకులా తమపై చర్యలు తీసుకోవాలని కోరేదని ఎద్దేవా చేశారు.

ఇరువర్గాల ఘర్షణ

కొడవళ్లు, రాడ్లు, కట్టెలతో పరస్పర దాడులు

ఎనిమిదిమందికి తీవ్రగాయాలు

ధర్మవరం మండలం ఏలుకుంట్లలో ఘటన





చికిత్స పొందుతున్న శ్రీనివాసులు, అప్పస్వామి

ధర్మవరంరూరల్, మే25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో ఆదివారం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన బొగ్గు నాగరాజు, తిరువీధుల విజయ్ రెండేళ్ల కిందట వ్యక్తిగత కారణాలతో ఘర్షణ పడ్డారు. అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. ఆ కక్షలు అలాగే రగులుతూ ఉన్నాయి. ఈక్రమంలోనే తిరువీధుల విజయ్ ఆదివారం చెరువు సమీపంలోకి వెళ్లాడు. అక్కడ తోటవద్దకు వెళుతున్న బొగ్గు నాగరాజు ఎదురుపడ్డాడు. పాత ఘటనల నేపథ్యంలో ఇద్దరూ వాగ్వాదం చేసుకుంటూ గొడవ పడ్డారు. తర్వాత తిరువీధుల విజయ్ గ్రామంలోకి చేరుకుని కుటుంబసభ్యులు, బంధువులకు జరిగిన విషయం తెలిపి, దాడికి సిద్ధమయ్యాడు. బొగ్గు నాగరాజు కూడా తమ వర్గీయులతో కలిసి కొడవళ్లు, ఇనుపరాడ్లు, కట్టెలు తీసుకుని విజయ్‌వర్గీయులపై దాడులకు దిగాడు. ఈ దాడిలో తిరువీధుల విజయ్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, అప్పస్వామిలకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తిరువీధుల విజయ్‌వర్గీయుల దాడిలో బొగ్గు నాగరాజు, సత్యమయ్య, దామోదర్, ఓబుళమ్మకు గాయాలయ్యాయి. వీరిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అప్పస్వామి, విజయ్‌లను మెరుగైన చికిత్సకోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు రెండు వర్గాలపై కేసులు నమోదు చేశారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి గ్రామానికి చేరుకుని ఘర్షణకు గల కారణాలపై ఆరాతీశారు. గొడవలు జరగకుండా స్పెషల్‌పార్టీ పోలీసులతో గట్టిబందోబస్తు ఏర్పాటుచేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బైక్ అదుపు తప్పి ఇద్దరు.. ట్రాక్టర్ కింద పడి ఒకరు..



బోయ కల్యాణ్ మృతదేహం

శెట్టూరు, మే 25(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆదివారం ముగ్గురు జిల్లావాసులు మరణించారు. ఒకు గాయపడ్డారు. శెట్టూరు మండలంలోని ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో ద్విచక్రవాహనం బోల్తాపడి ఇద్దరు యువకులు మృతిచెందారు. కళ్యాణదుర్గంలోని బోయగేరికి చెందిన బోయ కల్యాణ్ (26), బోయ శ్రీనివాసులు (27) స్నేహితులు. అవివాహితులు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. స్వగ్రామానికి వచ్చిన వారు కర్ణాటక ప్రాంతానికెళ్లి ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గానికి ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని ఓ బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆ ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అటుగా వెళ్లే వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. కర్ణాటక ప్రాంతమైన పరశురాంపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి..



వడ్ల చంద్రశేఖర్ (ఫైల్)

పామిడి(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 44వ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్ కింద పడి వడ్ల చంద్రశేఖర్(38) మృతి చెందాడు. రామకృష్ణ అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ఎస్ గ్రామానికి చెందిన వడ్ల చంద్రశేఖర్, స్థానిక పామిడమ్మ వీధికి చెందిన రామకృష్ణ శ్రీనిధి ధాబా వద్దకు టీ తాగడానికి ట్రాక్టర్‌లో వెళ్లారు. ధాబా మూసివేసి ఉండటంతో వెనుదిరిగారు. ఈక్రమంలో ఆన్‌లోనే ఉన్న ట్రాక్టర్‌ను చెరోవైపు ఎక్కే ప్రయత్నంలో గేరు, యాక్సిలరేటర్ మీద కాలు పెట్టారు. దీంతో ట్రాక్టర్ కదిలి కిందపడ్డారు. చంద్రశేఖర్ మీదుగా ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రామకృష్ణ గాయపడ్డాడు. చంద్రశేఖర్ మృతదేహన్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకే పురస్కారాలు

ఘనంగా కనకదాస ప్రతిభా పురస్కారాల ప్రదానం



సర్టిఫికెట్లు, జ్ఞాపిక ఇస్తున్న ఎంపీ పార్థసారథి, ప్రముఖులు

అనంతపురం విద్య, మే 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడానికే కనకదాస ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. గుత్తిరోడ్డులోని కనకదాస కల్యాణమండపంలో టెన్త్‌లో 550 మార్కులపైన, ఇంటర్‌లో 900 మార్కులపైన వచ్చిన విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మేయర్ రాగే పరశురాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, ఆర్డీఓ మధులత ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివితే ఉన్నత స్థితికి చేరవచ్చన్నారు. విద్యార్థులు బలమైన లక్ష్యం, సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు. బాగా చదువుకుని ఐఏఎస్, ఐపీఎస్ వంటి కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. తర్వాత టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన 320 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. అంతకుముందు ఇండియా తరపున సౌత్ ఏషియా సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన మహేష్‌ను, పోలీస్ డ్యూటీ మీట్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన ఎస్ఐ కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, డాక్టర్ మహేష్, కురుబ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు వెంకటరాముడు, అధ్యక్షులు పద్మావతి, ప్రధానకార్యదర్శి నాగరాజు, కోశాధికారి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర విద్యార్థులకు..



విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే25(ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వడ్డెర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేశారు. నగరంలోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో ప్రతిభా పురస్కారాల సభను నిర్వహించారు. వడ్డెర సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభకు ముఖ్య అతిగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ ఇలా అన్నిరంగాల్లో దశాబ్దాల నుంచి వడ్డెర్లు వెనుకబడ్డారని తెలిపారు. వీటిని అధిరోహించాలంటే ఉన్నతవిద్య ఒక ఆయుధమన్నారు. ఆ దిశగా వడ్డెర విద్యార్థులను ప్రోత్సహించేందుకు వడ్డెర సేవాసంఘం కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు పురష్కారాలందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మారుతీ ప్రసాద్, లోకనాథ్, గంగన్న, సూర్యబాబు, వీఎస్ రాయుడు, శంకర్, రాజశేఖర్, వెంకటేశులు, ప్రకాష్, రామాంజినేయులు, రాఘవేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు



కోంనాథ్ (ఫైల్)

ధర్మవరం, మే 25(ఆంధ్రజ్యోతి): తన భర్త కోంనాథ్ కనిపించలేదని పట్టణంలోని శారదానగర్‌కు చెందిన నల్లజెన్ని వెన్నెల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. సీఐ తెలిపిన మేరకు కోంనాథ్ బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ అవసరాల నిమిత్తం రూ.6లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పు తిరిగి ఎలా చెల్లించాలో దిక్కుతోచడంలేదని తరచూ భార్యతో చెబుతూ మనోవేదన చెందేవాడు. ఇంటిని అమ్మి అప్పులు తీర్చాలని భార్యసలహా ఇవ్వడంతో సరే అన్నాడు. ఈ క్రమంలో కోంనాథ్ తెలిసిన వారి వద్ద డబ్బులు అప్పుగా అడిగానని, ఇప్పించుకుని వస్తానని చెప్పి ఈనెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికిరాలేదు. బంధువులు, తెలిసిన వాళ్ల వద్ద వెతికిన ప్రయోజనంలేకపోయింది. దీంతో వెన్నెల పోలీసులను ఆశ్రయించిందన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి మురళీనాయక్



నివాళులర్పిస్తున్న లోకేశ్వర్‌నాయక్

గోరంట్ల, మే25 (ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీనాయక్ దేశం గర్వించదగ్గ వ్యక్తి అని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నతుడని ఏపీఎస్‌టీసీ చైర్మన్, భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ సభ్యుడు లోకేశ్వర్‌నాయక్ కొనియాడారు. మండలంలోని కళ్లితండాలోని మురళీనాయక్ నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం నివాళులు అర్పించారు. జవాన్ తల్లిదండ్రులు, జ్యోతిబాయి, శ్రీరామునాయక్‌లను పరామర్శించి, సమాధిని సందర్శించారు.

న్యూస్ బాక్స్

భారీగా పెరిగిన పశువుల సంత ఆదాయం

● మార్కెట్ కమిటీకి రూ.5 లక్షలు

అనంతపురం రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంత ఆదాయం ఈ వారం భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 5లక్షలకు పైగా వచ్చింది. ప్రతి వారం రూ. 4లక్షల నుంచి రూ. 4.30లక్షల వరకు వచ్చేది. ఈ వారం అది కాస్త అమాంతం పెరిగిపోయింది. బక్రీద్ పండుగ దగ్గర పడుతుండటంతో కొనుగోలు పెరిగినట్లు తెలుస్తోంది. శని, ఆదివారాల్లో రెండు రోజుల సంత కారణంగా మార్కెట్‌కు రూ.5.27 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.71 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2.56 లక్షలు వచ్చిందని తెలిపారు.

ఘంటసాల మండపాన్ని సందర్శించిన సినీ దర్శకుడు



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న దర్శకుడు రామారావు తదితరులు

అనంతపురం కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఘంటసాల బయోపిక్ చిత్ర నిర్మాత, దర్శకుడు సీహెచ్ రామారావు ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు ఆవరణలోని ఘంటసాల మండపాన్ని దర్శించారు. ఈ సందర్భంగా ఘంటసాల ట్రస్టుసభ్యులు, పాత పాటల ప్రేమికుల సంఘం నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సీహెచ్ రామారావు చేతులమీదుగా ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో ఘంటసాల ట్రస్టు సభ్యులు ఓబుళదాస్, జీవీ రామయ్య, గాయనీ గాయకులు ఓబులు, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నివీర్ మురళీనాయక్ క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్ జ్ఞాపకార్థం సోమవారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభించనున్నట్లు డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో అమిటీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆయన ఆదివారం ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం, జట్ల పేర్లు నమోదుకు 8008550464, 7989369100, 9885531051 సెల్ ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అఖిల భారత ప్రభుత్వ డ్రైవర్ల కార్యవర్గంలో
జిల్లావాసికి చోటు



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రమేష్‌బాబు

అనంతపురం క్రైం, మే 25(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రభుత్వ డ్రైవర్ల సంఘంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబుకు చోటుదక్కింది. ఆయనను జోనల్ కార్యదర్శిగా నియమిస్తూ అఖిల భారత ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జోనల్ అధ్యక్షుడు మంజిత్ సింఘ్ ఉత్తర్వులు జారీ చేశారని రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ మేరకు చత్తీస్‌ఘడ్‌లో నిర్వహించిన మహాసభల్లో జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతపురం జిల్లా డ్రైవర్ల సంఘం నుంచి ఎన్నికైన రమేష్‌బాబును పలువురు డ్రైవర్లు అభినందించారు.

ముగిసిన ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్



మాట్లాడుతున్న ఏపీ ఎస్ఐఓ మాజీ అధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్

అనంతపురం రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదర్శనగర్‌లో ఉన్న ఇస్లామిక్ సెంటర్‌లో స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ ఆదివారం ముగిసింది. కార్యక్రమా నికి ఆంధ్రప్రదేశ్ ఎస్ఐఓ మాజీ అధ్యక్షుడు అబ్దుల్లాఖాన్, రాష్ట్ర క్యాంపస్ కార్యదర్శి రియాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఖురాన్ పఠనం, దాని ప్రాముఖ్యత, ప్రవక్త జీవిత విశేషాలు, వ్యక్తిత్వ వికాసం గురించి వివరిం చారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మన్సూర్, పట్టణ అధ్యక్షుడు నిజాముద్దీన్, జమాత్-ఎ-ఇస్లామీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శ



టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, మే 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామగిరి మండలం ముత్యాలంపల్లికి చెందిన టీడీపీ నాయకుడు కాంతాస్వామిని ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. కాంతాస్వామి శనివారం సాయంత్రం మండల సరిహద్దున కర్ణాటక ప్రాంతంలో ఆటోలో వెళ్తున్నాడు. ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో స్వల్పంగా గాయపడ్డాడు. ఆయనను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఆయనకు తీవ్రమైన తలనొప్పి రావడంతో వైద్యపరీక్షల అనంతరం బెంగళూరుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె సోదరుడు బాలాజీ, టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామ యాదవ్, శ్రీధర్ నాయుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. పార్టీతో పాటు పరిటాల కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.

పసుపు పండుగను విజయవంతం చేద్దాం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

● కడపలో మహానాడుకు తరలిరండి
● జగన్‌రెడ్డి ఇలాకాలో భయం మొదలైంది
● అందుకే కరోనా నాటకాలు
● ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): పసుపు పండుగ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. కడపలో రాష్ట్రస్థాయి మహానాడు జరుగనున్న నేపథ్యంలో, ఆమె ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పలువురు టీడీపీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అవిర్భావం నుంచి మహానడు అనేది ఒక పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఆనాడు ఎన్టీఆర్ దగ్గర నుంచి నేటి వరకు ఇది ప్రతి కార్యకర్తకు అది పండుగ లాంటి రోజు అన్నారు. తొలిసారి కడపలో జరుగుతున్న ఈ మహానాడుకు మొదటి రెండురోజులు ఒక్కోరోజు 30వేల మందికి పైగా ప్రతినిధులు, మూ డోరోజు జరిగే బహిరంగ సభకు కనీవినీ ఎరుగని రీతిలో ఐదు లక్షలమంది వరకు నాయకు లు, కార్య కర్తలు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇ ప్పటికే రాష్ట్ర నా యకత్వం ఆధ్వ ర్యంలో మహానాడు నిర్వహణ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. నియోజకవర్గం నుంచి కూడా పెద్దఎత్తున కార్యకర్తలు తరలివస్తు న్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జగన్‌రెడ్డి ఇలాఖాలో మహానాడు అన్నప్పటి నుంచి వైసీపీలో వణుకు మొదలైందన్నారు. ఇప్పటికే 11సీట్లకు పరిమితమైన వైసీపీ రానున్న రోజుల్లో ఇంకా పతనావస్థకు చేరుకుంటుందన్నారు. ఆ భయంతోనే అప్పుడే కడపలో జరిగే పసుపు పండుగకు ఆటంకం సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరోనా కేసులు లేనప్పటికీ మహానాడు ద్వారా కొవిడ్ మరింత విజృంభించే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తు న్నారన్నారు. మహానాడును వాయిదా వేసుకోమని చెప్పడం, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం చూస్తుంటే వారిలో భయం ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. టీడీపీ కార్యకర్తలు ఇవేవి పట్టించుకోకుండా మహానాడును విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కన్వీనర్ శ్రీనివాసులు, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి రాప్తాడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం విద్య, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పౌజ్ పాయింట్లు రావడం లేదని, పీఈటీలు, ఎల్పీలకు సైట్ ఓపెన్ కావడంలేదన్నారు. పాత స్టేషన్ పాయింట్ల కోసం క్లిక్ చేస్తే....సున్నా పాయింట్లు వస్తున్నాయన్నారు. సబ్‌మిట్ చేసినా, కొందరు టీచర్లు దరకాస్తు చేసినా ఎర్రర్ వచ్చిందన్నారు. అనేక సమస్యలపై గ్రీవెన్స్ ఇస్తే, అధికారులు పెడచెవిన పెడుతున్నారన్నారు. పలు సాంకేతిక సమస్యల వల్ల దరకాస్తు చేయడానికి టీచర్లు రాత్రి 11 గంటల వరకూ వేచి చూడాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు.

అంధులకు స్మార్ట్ ఆన్ కంటి అద్దాల పంపిణీ



అంధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దాతలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 25(ఆంధ్రజ్యోతి): అంధులకు ఉచితంగా స్మార్ట్ ఆన్ కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లా అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏపీపీ ఎన్ఓ మెడికల్ యంత్ర అనే సంస్థ ద్వారా ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 30మంది అంధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంధ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి మాట్లాడుతూ... రూ. 40వేలు విలువ చేసే స్మార్ట్‌ఆన్ కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయడానికి ముందుకు వచ్చిన అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రమేష్‌షా, జయషా దంపతులకు, శాస్త్రవేత్త భువనేశ్వరి శర్మకు ధన్యవాదాలు తెలిపారు. సత్యసాయి ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, కార్యదర్శి లావణ్య, సభ్యులు మధురం రాజాగోపాల్, ప్రియా, ప్రణవ్‌కుమార్, అనూజ్‌శర్మ, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనాయుడు, షాజీయా, కోశాధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేసిన వారికి సత్కారం



నిర్వాహకులను సన్మానించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్

రామగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట దుర్గాంబ జాతర మహోత్సవాన్ని విజయవంతం చేసిన సభ్యులను ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చేతులమీదుగా ఆదివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ముందుగా దుర్గాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యే క పూజలు చేయించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 18వతేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ జాతరను అత్యంతవైభవంగా నిర్వహించారు. 64 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న ఉత్సవాలు కావడంతో రెండు నెలల ముందు నుంచే ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా ఆలయం వద్ద పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఐదు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఎక్కడ ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉత్సవాలు ఘనంగా నిర్వహించినందుకు ఆలయ కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాల శ్రీరామ్ అభినందించి వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నసనకోట, గంగంపల్లి, వెంకటాపురం గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఐక్యంగా ఈ జాతర మహోత్సవాన్ని జరుపుకున్నారన్నారు. 64 ఏళ్ల తరువాత జరిన జాతరలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారన్నారు. ఇక నుంచి జాతర మహోత్సవాలను కొనసాగిస్తామని వారు అన్నారు. దుర్గాంబ ఆశీస్సులతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు పాడి పంటతో సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

దేశంలో హక్కుల ఉల్లంఘన



ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా వెళ్తున్న దృశ్యం

● శాంతిర్యాలీలను అడ్డుకుంటున్న పోలీసులు
● ప్రజాసంఘాల వైక్యవేదిక నాయకుల మండిపాటు

అనంతపురం సెంట్రల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆదివాసులు, మావోయిస్టులను హతమారుస్తూ కేంద్ర, రాష్ట్రప ప్రభుత్వాలు దేశంలో ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మండిపడ్డారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక సమావేశాన్ని నిర్వహించింది. అనంతరం స్థానిక జడ్పీ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ చేపట్టింది. అయితే ర్యాలీకి పోలీసులు అడ్డంకులు సృష్టించడం, అడ్డుకోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్, గ్రీన్ హంట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న నరమేధం, హత్యాకాండను దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లతో ఆదివాసులను, మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటున్న తీరుపై ప్రశ్నించే గొంతుకులను పోలీస్‌శాఖ అణచివేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. మావోయిస్టు కేంద్ర నాయకులు నంబాల కేశవరావు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా కుట్రపూరిత విధానాలు అమలుచేస్తోందన్నారు. కేంద్రం తీరును ఎండగడుతూ శాంతిర్యాలీలు చేస్తున్న వారిపై పోలీసుల జులుం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూళ్లను అమలు చేయాలని, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని నాయకులు డిమాండ్‌చేశారు. లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో వేదిక నాయకులు అబ్దుల్ రజాక్, శ్రీరాములు, వెంకటేశులు, విశ్వనాథ, సురేష్, రాజశేఖర్, వేమన, చంద్రప్ప, విజయ్, కృష్ణ, అశోక్, రాహుల్, ప్రకాష్, లక్ష్మి, హరిత తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద వేదిక నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

వైద్యులు లేని పశు వైద్యశాలలు



రామగిరి పశు వైద్యకేంద్రం

● ఇబ్బందుల్లో పాడి రైతులు, గొర్రెల కాపరులు


రామగిరి, మే 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పశువైద్య కేంద్రాలలో వైద్యులు లేక పోవడంతో పాడి రైతులు, గొర్రెలకాపరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రమైన రామగిరితోపాటు నసనకోట, పేరూరులో పశువైద్య కేంద్రాలలో అయితే పశువైద్యులు లేరు. కుంటిమద్ది, రామగిరి పరిధిలోని నాగసముద్రం గేటు (ఎన్ఎస్ గేటు) కేంద్రాలలో సహాయ వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా అక్కడ కూడా ఎవరూలేరు. ప్రస్తుతం రామగిరి పశువైద్య కేంద్రానికి కనగానపల్లి పశువైద్యాధికారి మౌలాలిసాబ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే నసనకోట, పేరూరు కేంద్రాలకు నాగసముద్రం పశువైద్యాధికారి సునిల్‌కుమార్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. మండలంలో 4400 ఆవులు, 1085 గేదె, గొర్రెలు 1.50లక్ష గొర్రెలు, 10వేల మేకలతో పాటు కోళ్లు ఇతర మూగజీవాలు ఉన్నాయి. వీటికి అత్యసర చికిత్సలు అవసరమైనప్పుడు వాటి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సచివాలయంలో పనిచేస్తున్న పశువైద్య సిబ్బంది, కాంట్రాక్టు సిబ్బంది ఈ పశువైద్య శాలల్లో పనిచేస్తున్నారు. ఆ వైద్య సిబ్బందితోనే పశు వైద్యశాలలు నడుపుతున్నారు. దాదాపు రెండేళ్ల క్రితం మండలంలో పనిచేస్తున్న పశువైద్యులు బదిలీలపై వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడికి ఎవరినీ నియమించలేదు. ఆవులు, గేదెలకు ఏదైనా ప్రమాదకర జబ్బులు వస్తే పశువైద్యులు లేకపోవడం వల్ల రైతులు బయట మందులు వాడి తీవ్రంగా నష్టపోతున్నారు.

పశువైద్యులు లేక చాలా నష్టపోతున్నాం



మండలంలోని పశువైద్య కేంద్రాల్లో డాక్టర్లు లేకపోవడంతో పశువులకు ప్రమాదకర జబ్బులు వచ్చినప్పుడు మేము చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఆవులకు పొదుపువాపు, జ్వరాలు అధికంగా వస్తుంటాయి. వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. కేంద్రాలలో ఉన్న సిబ్బందితో వైద్యసేవలు చేయించినా వారికి ఆ జబ్బు గురించి పూర్తిగా అవగాహన ఉండదు. ఇన్‌చార్జ్‌గా ఉన్న డాక్టర్లకు ఈ విషయం చేరవేస్తే వారు వచ్చి చూసేసరికే అప్పటికే నష్టం జరిగిపోయి ఉంటుంది. - అశ్వత్థప్ప, రైతు, దుబ్బార్లపల్లి

పశువైద్యశాలకు భవనాన్ని నిర్మించండి



పేరూరులో పశువైద్యకేంద్ర భవనాన్ని నిర్మించి వైద్యులను నియమించాలి. ఇక్కడున్న పశువైద్య కేంద్రం పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వ భవనంలోని గదిలో సిబ్బంది పశువైద్య సేవలు అందిస్తున్నారు. సచివాలయ సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగి ఇక్కడ పనిచేస్తున్నారు. పేరూరులో పాడిపశువులు, గెదేలు చాలా ఉన్నాయి. చాలా రోజులుగా డాక్టర్లు లేకపోవడం వల్ల మేము ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కోసారి వ్యయప్రయాసల కోర్చి, వేరే మండలానికి వెళ్లి అక్కడి వైద్యుల సేవలు తీసుకోవాల్సి వస్తోంది. - ఈశ్వరయ్య, రైతు, పేరూరు

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడూ ఓ కంట కనిపెట్టుకుని ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సూ చించారు. ఆయన ఆదివారం మండలంలోని రాచానపల్లిలో ఉన్న ఆర్డీటీ పాఠశాలలో ఇంటర్నేషనల్ మిసింగ్ చిల్డ్రన్ డేను పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు తప్పిపోవడానికి గల కారణాలను ప్రజలకు వివరించారు. పిల్లలు తప్పి పోయినప్పుడు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సంద ర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. పిల్లల విషయంలో తల్లిదం డ్రులు అప్ర మత్తంగా ఉండాలన్నారు. వారు ఎవరితో కలుస్తున్నారు, ఎక్కడ తిరుగుతున్నారు, ఏం చేస్తున్నారన్న విషయాలను తరచూ గమనిస్తుం డాలన్నారు. చిన్న పిల్లల పట్ల అజాగ్రత్తగా ఉండకూడ దన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఎస్ఐ రాంబాబు, సర్పంచు ఆంజనేయులు, ఎంపీటీసీలు క్రిష్టారెడ్డి, గౌస్, కార్మికశాఖాధికారి సూర్యనారాయణ, చిన్నపిల్లల సంరక్షణ హోం అధికారి దేవరాజు, మహిళ శిశు సంరక్షణ సిబ్బంది మంజునాథ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు భానుజా తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కారానికి చొరవ



శ్మశాన వాటికకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కురుగుంట పంచాయతీలో ఎరుకుల కులస్థులకు సంబంధించిన శ్మశాన వాటిక సమస్య పరిష్కారినికి టీడీపీ నాయకులు చొరవ చూపారు. కొన్నేళ్లుగా గ్రామ సమీపంలో ఎరుకుల కులస్థుల శ్మశాన వాటికలో మృత దేహాలను ఖననం చేసేందుకు స్థానికుల నుంచి అభ్యంతరాలు వస్తుండేవి. తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి సమస్యను ఇటీవల ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీకెళ్లారు. ఈ క్రమంలోనే ఆదివారం శ్మశాన వాటికకు ఆయన ఆధ్వర్యంలో ఫెన్సింగ్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి గ్రామంలో నివాస ముంటున్న ఎరుకుల కులస్థులు తమకు సంబంధించిన వారు చనిపోయినప్పుడు వారి మృతదేహాలను స్థానిక శ్మశానవాటిలోకి పూడ్చేవారన్నారు. స్థానికంగా కొంత మంది వ్యక్తులు ఇటీవల కాలంలో మృతదేహాలను అక్కడ పూడ్చేందుకు అడ్డంకులు సృష్టించారన్నారు. దీంతో సమస్యను ఆ కులస్థులు తమ దృష్టికి తెచ్చారన్నారు. తాము ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి, ఆమె ఆదేశాల మేరకు ఎరుకల శ్మశానవాటికకు ఫెన్సింగ్ వేయించామని నారాయణస్వామి తెలిపారు.

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'



విద్యార్థులకు ప్రసంశా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కనగానపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగాసన స్పోర్ట్సు అసోసియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షాణా తరగతుల్లో మంచి ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు ప్రసంశా పత్రాలు అందజేశారు. యోగా చేయడం వలన కలిగే ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సాకే ఈశ్వరయ్య, దివాకర్, గ్రంథాలయాధికారి గోవిందు, సర్పంచ్ అంకే రామక్రిష్ణ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైకి ముళ్ల కంపలు



రహదారిపైకి చొచ్చుకు వస్తున్న ముళ్ల కంపలు

రాప్తాడు, మే 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన రాప్తాడు నుంచి మండల పరిధిలోని పంగల్ రోడ్డు వరకు నిర్మించిన 42వ జాతీయ రహదారిలోకి ముళ్ల కంపలు ఇరువైపులా చొచ్చుకుని వస్తున్నాయి. డివైడర్ల వద్ద ముళ్ల చెట్లు పెరిగి కొమ్మలు రహదారిలోకి వస్తున్నాయి. ఇలా వచ్చిన కొమ్మలు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలకు తగులున్నాయి. దీంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు భయాందోళనతో రోడ్డుపై సంచరిస్తున్నారు. ముళ్ల కంపలు రహదారిపైకి చొచ్చుకురావడంతో దిచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు పంక్చర్లు కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని ప్రయాణికులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి ముళ్ల కంపలు రహదారిపైకి రాకుండా తొలగించాలని వారు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

క్రీడలతో మానసికోల్లాసం

● ప్రభుత్వ విప్ కాలవ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, మే 25(ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామం వద్ద కేపీఎల్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే ఈ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, నాగిరెడ్డి రాజు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

● నీట మునిగిన వేరుశనగ పంట



వేరుశనగ పంటలోకి చేరిన కాలువ నీరు

ఉరవకొండ,మే25 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో వేరుశనగ పంట నీట మునిగి నష్టం వాటిల్లింది. మండలంలోని రాకెట్ల గ్రామంలో హంద్రీనీవా కాలువ సమీపంలో శ్రీనివాసులు అనే రైతు వేరుశనగ పంటను సాగు చేశాడు. కాలువ వెడల్పు పనులు జరుగుతున్నాయి. కాలువలోకి భారీగా వర్షపు నీరు రావడంతో కాంట్రాక్టర్లు కాలువకు గండికొట్టారు. పక్కనే ఉన్న రైతు పొలంలోకి వర్షపునీరు చేరి పంట దెబ్బతినింది. రూ.70లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

కదలని ధాన్యం లారీ

● ఆందోళనలో అన్నదాతలు



ఉద్దేహాళ్‌లో నిలిపి ఉన్న ధాన్యం లారీ

బొమ్మనహాళ్, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ సొసైటీలో కొనుగోలు చేసిన ధాన్యం లారీ ఐదురోజులుగా ఇక్కడే ఉంది. ధాన్యం వెళ్లకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రబీసీజన్‌లో ధాన్యం కొనుగోలు నుంచి ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దిరెడ్డి, గోవిందు, జనార్దనపల్లి రామాంజనేయులుకు చెందిన 38 టన్నుల ధాన్యంలో ఐదురోజులుగా ఇక్కడే ఆగింది. ఇప్పటివరకు 60 మంది రైతులకు 520 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఐదురోజులుగా ఒకలారీలో 38 టన్నుల ధాన్యం ఆగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మీ ధాన్యాన్ని తీసుకుంటే మా లారీను తీసుకెళతామని డ్రైవర్ వాదనకు దిగుతున్నాడు. దీనిపై సొసైటీ సెక్రెటరీ హనుమంతును వివరణ కోరగా ధాన్యం కొనుగోలుకు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, అనుమతి వచ్చిన తర్వాత తరలిస్తామన్నారు.

ఆర్థికసాయం

తాడిపత్రి, మేౠ25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన కార్పెంటర్ కాశర్ల సిద్దయ్యకు తాడిపత్రి కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రూ.33వేలు ఆర్థికసాయం అందజేసినట్లు అధ్యక్షుడు హుస్సేన్‌పీర్ తెలిపారు. సిద్దయ్య గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సభ్యులు ఆయన ఇంటివద్దకు వెళ్లి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆంజనేయులు, భాషా, ఖాజన్న, ప్రసాద్‌చారి, సూర్యనారాయణ, వీరభద్రయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

పెద్దవడుగూరు, మేౠ25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాంపల్లి గ్రామంలో ఆదివారం సీనియర్ విభాగానికి సంబంధించి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో 15గాండ్ల ఎద్దులు పాల్గొన్నాయి. బొంది కేశవరెడ్డి, సురేందర్‌రెడ్డిలకు చెందిన ఎద్దులు 3,915 అడుగులు లాగి రూ.1.20లక్షలు నగదు బహుమతిని గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. కడపజిల్లా చంద్ర ఓబుల్‌రెడ్డికి చెందిన ఎద్దులు 3,703అడుగులు లాగి ఒక్కరూపాయలు, హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎద్దులు 3,468అడుగులు లాగి రూ.80వేలు, నంద్యాల జిల్లా హుస్సేనాపురానికి చెందిన రామసుబ్బారెడ్డి ఎద్దులు 3,357 అడుగులు లాగి రూ.60వేలు, నంద్యాల జిల్లా గుంపరమాను దిన్నె గ్రామానికి చెందిన రాజాపాలెరెడ్డి ఎద్దులు 3,330అడుగులు లాగి రూ.50వేలు గెలుచుకున్నట్లు తెలిపారు.

నేడు తాడిపత్రిలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

●కలెక్టర్ వినోద్‌కుమార్


అనంతపురం టౌన్, మేౠ25(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం తాడిపత్రిలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రకటనలో వెల్లడించారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● యోగాంధ్రలో నమోదు చేసుకోండి

యోగాంధ్ర యాప్‌లో జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ప్రకటనలో కోరారు. మే21 నుంచి జూన్21వ తేదీవరకు యోగాంధ్ర క్యాంపెయిన్ ఉంటుందన్నారు. యోగాంధ్రలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

తెలంగాణ ఈసెట్‌లో విద్యార్థి ప్రతిభ

యాడికి, మేౠ25(ఆంధ్రజ్యోతి): ఆదివారం విడుదలైన తెలంగాణ ఈసెట్ ఫలితాల్లో అనంతపురం జిల్లా యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన రబీక్ ఖాన్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించాడు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో రెండో ర్యాంక్ సాధించాడు. మైనింగ్‌లో ఇంజనీరింగ్ చేయడమే తన లక్ష్యమని రబీక్‌ఖాన్ తెలిపాడు. ఏపీ ఈ-సెట్‌లో రబీక్‌ఖాన్ మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించాడు. రబీక్‌ఖాన్ తండ్రి బోషాఖాన్ మైనింగ్‌లో రాజీవ్‌గాంధీ ఉండడం గమనార్హం.



రబీక్‌ఖాన్

మీరే.. పార్టీకి బలం

● మీవల్లే ఈ స్థాయికి ఎదిగాం
● మీరు లేకుంటే ఎక్కడికి వెళ్లేవాడినో నాకే తెలియదు
● మినీ మహానాడులో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి



వేదికపై ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి, జేసీపీఆర్ ఇతర నాయకులు

తాడిపత్రి, మేౠ25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే బలమని మీ కష్టంతోనే పార్టీ నిలబడిందని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కమ్యూనిటీ హాలులో మినిమహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెట్టిందని ప్రతి కార్యకర్తతోపాటు మా కుటుంబాన్ని మమ్మల్ని జైలుపాలు చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇలాంటి పార్టీని ప్రజలే బుద్దిచెప్పి సాగనంపారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని అరాచకాలు తాడిపత్రిలో జరిగాయని, పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రతిపనిని అడ్డుకుంటూ కేసులు బనాయిస్తూ నానా ఇబ్బందులు పెట్టారన్నారు. తెలుగుదేశంపార్టీ క్రమశిక్షణ పార్టీ అని ఇక్కడ పార్టీ కుటుంబ సభ్యులు కార్యకర్తలు పార్టీకి ఎప్పుడు అండదండగా ఉంటారన్నారు. ఇలాంటి పార్టీలో ఉన్నందుకు గర్వకారణమన్నారు. సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, అభివృద్ధి పథకాలు పెట్టిస్తున్నారన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 10మందికి సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.11,29,355 చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

మీరు ఆదరించడం వల్లే ఈ స్థాయిలో ఉన్నాం
-మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

మీరు మమ్మల్ని 40ఏళ్లుగా ఆదరించడం వల్లే ఈ స్థాయిలో ఉన్నామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 2021 మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో తాడిపత్రి మున్సిపాలిటీ ఒక్కటే టీడీపీ గెలిచిందంటే ఇక్కడ నాయకులు, కార్యకర్తలు బలం ఎంత ఉందో అందరికి అర్థమవుతుందన్నారు. మీరు మా కుటుంబాన్ని మమ్మల్ని ఆదరించడం వల్లే మున్సిపాలిటీ గెలుచుకోవడంతోపాటు మా కుటుంబానికి అన్నివిధాలా ఎదురొడ్డి నిలబడి గెలిపించినందుకు మీకు చేతులు ఎత్తి నమస్కరిస్తా, మీ రుణం ఏమి ఇచ్చినా తీర్చుకోలేని బావోద్వేగానికి గురయ్యారు. నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా జేసీ కుటుంబం అదుకుంటుందని మాజీ ఎంపీపీ వేలూరి రంగయ్య అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అనుసంధానం చేసేలా చూడాలని ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డిని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి కోరారు.

రక్తదాన శిబిరం: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి 73వ పుట్టినరోజు సందర్భంగా కార్యకర్తలు, నాయకులు 73కిలోల కేక్‌ను తీసుకువచ్చి ఆయనతో కట్ చేయించారు. పుట్టినరోజు కావడంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. 800మంది దాతలు రక్తాన్నిఇచ్చారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి భార్య ఉమారెడ్డి, ఎమ్మెల్యే భార్య నిఖిలారెడ్డి రక్తదానం చేశారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న జేసీ ఉమారెడ్డి

మహానాడుకు తరలిరండి: ఎమ్మెల్యే అమిలినేని



కళ్యాణదుర్గం, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో 27వ తేదీ నుంచి జరిగే టీడీపీ రాష్ట్ర స్థాయి మహానాడుకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 27 నుంచి మూడు రోజుల పాటు కడపలో మహానాడు జరుగుతుందన్నారు. తొలిరోజు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి, రెండో రోజు ఈ ప్రభుత్వ ఏడాది విజయంపై చర్చ, మూడో రోజు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించిందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూడో రోజు బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఎంపీ అంబికా సోదరి వేదవతి సంతాప సభ

గుంతకల్లుటౌన్, మే25(ఆంధ్రజ్యోతి): హెలికాఫ్టర్ ప్రమాదంలో మృతి చెందిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి సంతాప సభను ఆదివారం పట్టణంలోని హనుమేష్ నగర్‌లోని వారి స్వగృహంలో నిర్వహించారు. 8న ఎంపీ సోదరి వేదవతి కుమారి, ఆమె భర్త ముత్తురు బాస్కర్ గంగోత్రి యాత్రకు వెళ్లి హెలికాఫ్టార్ ప్రమాదంలో జరిగిన సంగతి తెలిసిందే. వేదవతి చిత్రపటానికి ఎంపీ టీడీపీ, వైసీపీ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముత్తూరుభాస్కర్, ఆయన కుమారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయానికి రూ.50వేలు విరాళం

గుంతకల్లుటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయానికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి ఆదివారం రూ.50వేల విరాళాన్ని అధికారులకు అందజేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో ఆలయ అధికారులకు నగదును అందజేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దశరథరెడ్డి, దాసరి హరిబాబు, మాజీ సర్పంచు తిక్కస్వామి, బెస్త మనోహర్ పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

గుంతకల్లుటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): సత్యసాయి వాటర్ సప్లై కార్మికుడు మంగే సూరప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం ఆయన స్వగృహంలో నాయకులు సూరప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, కార్మికులు చిన్న, బాలయ్య, సీఐటీయూ సురేంద్ర, తిమ్మప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

మూడువేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరు

రాయదుర్గంరూరల్,మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మండలానికి మూడు వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరు చేసినట్లు వ్యవసాయ శాఖ ఏఓ మహేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 9,743 మంది రైతులు ఉండగా 16 వేల హెక్టార్ల భూమి సాగులో ఉన్నట్లు తెలిపారు. అందులో 11 వేల హెక్టార్లు వేరుశనగ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రూ.9300 ధర నిర్ణయించగా 40 శాతం సబ్సిడీ రూ.3720 పోను రూ.5580 రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

28న ప్రతిభా పురస్కారాలు

కళ్యాణదుర్గం, మే 25(ఆంధ్రజ్యోతి): వాల్మీకి సామాజిక వర్గంలో పది, ఇంటర్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను 28వ తేదీన అందించనున్నట్లు వాల్మీకి ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జ్యోతిరావు ఫూలే జూనియర్ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఉరవకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీచౌక్‌లో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. స్థానిక బసవేశ్వర ఆలయం నుంచి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వరకు రూ.8లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ప్యారం కేశవానంద తెలిపారు. అల్లాబకాష్, భాదర్, యూనిస్, పామిడి నూర్ పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయండి

గుంతకల్లుటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు బీ గోవిందు పిలుపునిచ్చారు. స్థానిక బీటీ పక్కీరప్ప కాలనీలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే దేవేంద్ర అధ్యక్షతన సీపీఐ 8వ శాఖ మహాసభలను నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ దేవరగుడి లక్ష్మీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ నంతరం బీటీ పక్కీరప్ప శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నరసింహాచారి, సహాయ కార్యదర్శులుగా అలీల్, పెయింటర్ వీరాంజినేయతో పాటు 12 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరభద్రస్వామి, మహేష్, గోపినాథ్, రమాదేవి పాల్గొన్నారు.

ఇంటి పట్టాలకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటివరకు ఇల్లు మంజూరు కాని, సొంత స్థలం లేనివారు ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు ఆదివారం కోరారు. అర్హులైన వారు ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం 90 రోజుల్లోగా ఇంటి పట్టాలను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వంలో ఇల్లు మంజూరు కానివారు, కనీసం ఇంటి నిర్మాణానికి స్థలం లేని వారు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతో సచివాలయంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యం

కూడేరు, మే 25(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యమని చోళసముద్రం సర్పంచ్ వడ్డే రమాదేవి అన్నారు. ఆదివారం గ్రామంలో నమ్మక్క సమావేశం నిర్వహించారు. కార్యకర్తలకు పలు కార్యకర్తలకు పంపిణీ చేశారు. సర్పంచుతోపాటు వడ్డే రాజు, కేశన్న, సుద్దల గోవిందు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, పాండురంగ, రాము, చంద్రబాబునాయుడు, తిప్పయ్య పాల్గొన్నారు.

అలరించిన పౌరాణిక నాటక ప్రదర్శన

పామిడి, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొరకాయలపేట గ్రామంలో ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ తెలుగుబాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచరత్నాలు పౌరాణిక నాటక ప్రదర్శన అందరినీ అలరించింది. సద్గురు నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం దేవరాజు మాట్లాడుతూ పౌరాణిక రంగస్థల నాటకాలు రోజు రోజుకూ అంతరించిపోతున్న తరుణంలో పేద కళాకారుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత నాటక ప్రదర్శనలు కల్పించడం హర్షణీయమన్నారు. నెమళ్లపల్లి సుంకన్న, నవీన్ కుమార్, డోన్ శివ సంగీత వాయిద్యాలు వాయించగా పంజా కృష్ణారావు, టీ నాగరాజు, సరహరి, బెస్త ఓబులేసు, చెన్నయ్య, పరమేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, వన్నూరప్ప, అనిత కుమారి పోటా పోటీగా ఆలపించడం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.

రోడ్డు ప్రమాదంలో విలేకరి మృతి



నాగరాజు(ఫైల్)

ఉరవకొండ,మే25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చానల్ విలేకరి నాగరాజు(32) మృతి చెందాడు. ఉరవకొండ నుంచి స్వగ్రామమైన బూదగవికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా పాల్తూరు క్రాస్ వద్ద ఎనుము అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విలేకరికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య తొమ్మిది నెలల గర్భవతి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎలుగుబంట్ల సంచారంతో ప్రజల ఆందోళన

కళ్యాణదుర్గం, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మారెంపల్లి కాలనీ కూతవేటు దూరంలో ఉన్న వన్నూరుస్వామి కొండలో నాలుగు ఎలుగుబంట్లు హల్‌చల్ చేస్తున్నాయి. రెండు రోజుల నుంచి కొండలో రోడ్‌సైడ్ అరుసు సంచరిస్తున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో సంచరిస్తున్నారు. ఆయితే వారికి కొద్ది దూరంలోనే ఎలుగుబంట్లు సంచరిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ మధ్య కాలంలో కళ్యాణదుర్గం అటవీ ప్రాంతంలో ఎలుగుబంట్లు సంచారం అధికంగా ఉంటోంది. సమీప గ్రామాల ప్రజలు ఎప్పుడు ఎలుగుబంట్లు వచ్చి దాడి చేస్తాయోనని భయాందోళనతో కాలాన్ని గడుపుతున్నారు.



కొండ ప్రాంతంలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

గుండెపోటుతో కూలీ మృతి

కూడేరు, మే 25, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హసంపల్లి గ్రామానికి చెందిన లలిత (36) అనే మహిళా కూలీ తోటలో పని చేస్తూ ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన సహదేవ, లలిత దంపతులు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. దిన చర్యలో భాగంగా ఆదివారం గ్రామంలోని ఓ రైతు తోటలో పనికివెళ్లిన లలిత అక్కడే గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

బెళుగుప్ప, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామసాగరంలో ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రైతు సంజీవరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. రైతు తన పొలంలో కరెంట్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా షాక్‌కు గురై కిందపడ్డాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ గంగాధర్‌ను వివరణ కోరగా మరమ్మతు చేసేందుకు ఎల్సీ ఇవ్వాలని సిబ్బందిని కోరామన్నారు. ఎల్‌సీ ఇవ్వకుండానే రైతు స్తంభం ఎక్కడంతోనే షాక్‌కు గురయ్యాడని సిబ్బంది చెబుతున్నారని అన్నారు.

సైనికుల త్యాగం.. అజరామరం

● ఘనంగా తిరంగా ర్యాలీ

యాడికి, మే 25(ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం సైనికులు చేసిన ప్రాణత్యాగం అజరామరమని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా ఆదివారం యాడికిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. 750అడుగుల జాతీయ జెండాను గ్రామవీధుల్లో రెపరెపలాడించారు. గాంధీ విగ్రహం వద్ద జాతీయ పతాకంతో మానవహారంగా ఏర్పడి భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు. ర్యాలీలో రుద్రమనాయుడు, పరిమి చరణ్, సునీల్‌కుమార్, రాజశేఖర్, తిరుపతి నీలకంఠ, విశ్వనాథ్, నారాయణస్వామి, తాండ్ర విక్రమ్, ఆదినారాయణ, బొట్టు శేఖర్, రామాంజనేయులు, చౌదయ్య పాల్గొన్నారు.



750 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజలు



కొనకొండ్ల-ఉరవకొండ ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు

రహదారిపైనే మురుగు

● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

ఉరవకొండ, మే25 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొనకొండ్ల-ఉరవకొండ ప్రధాన రహదారి వెంబడి నిత్యం వందల వాహనాలు వెళ్తూ ఉంటాయి. వర్షం వస్తే డ్రైనేజీ నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో ఈ మార్గంలో వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం పక్కనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో భక్తులు ఆలయంలోకి వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. కల్వర్టు నిర్మించాలని రెండేళ్ల నుంచి అడుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు

కూడేరు, మే 25, (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల ఆవరణలో 1999-2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు కలయిక కోలాహలంగా సాగింది. ఆ రోజుల్లో చేసిన చిలిపి పనులు, ఆటలు, పాటలు గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. చదువులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మదుసూదన్, శివప్రసాద్, ఓబులమూర్తి పాల్గొన్నారు.



పామిడిలో..

పామిడి: పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల కలయిక ఘనంగా జరిగింది. పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సరస్వతీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నలభై ఏళ్ల తర్వాత కలయిక జరగడంతో పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడిగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆయరెడ్డి, తిరుపాలు, పీడీ గోపాల్, హెచ్ నారాయణరావు, గోపాల్‌రెడ్డి, నాగేష్, శ్రీనివాసులు, రాజశేఖర్, రామనాథ్‌శర్మ, శేషగిరి, మునిస్వామి, సతీష్ కుమార్, సదానందబాబు, వెంకటేశ్వరరావు, పులి శేఖర్ పాల్గొన్నారు.



గురువులతో 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999-2000సంవత్సరం పదోతరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలో కలియతిరిగి అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు.



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పుట్లూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఎవరు ఏ స్థాయిలో ఉన్నా సేవాభావంతో మెలగాలన్నారు. ఒకరినొకరికి సాయం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ మద్దతుదారుడి ఇంటిపై దాడి

తాడిపత్రి, మేౠ25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన వైసీపీ మద్దతుదారుడు సాయిరాం ఇంటిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం మత్తులో సాయిరాం ఇంటిపై దాడులు చేశారని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

తాడిపత్రి, మేౠ25(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో షాకీర్ (35) అనే వ్యక్తి అతిగా మద్యం తాగి రోడ్డుపై పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలుజిల్లా ఎమ్మిగనూరుకు చెందిన షాకీర్ బతుకుదెరువు కోసం తాడిపత్రికి వలసవచ్చాడు. బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో భార్య కూడా ఊరికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మరింత ఎక్కువగా మద్యం తాగుతుండేవాడు. శనివారం రాత్రి రాముకు వెళ్లలేక దారిలోనే పడి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.